

# తోడొకరుండిన....

## – శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

**"ఈ రోజు మీకందరికి** ఒక సర్ ప్రైజ్." భోజనాలు చేసి తాంబూలాలు వేసుకుంటున్న శ్రీహరి ఆడపిల్లలతో అన్నాడు.

"ఏంటి నాన్నా?"

"నేను చెప్పను సాయంత్రం మన ఇంటికి గెస్టులు వస్తున్నారు. అప్పటి దాకా ఈ సస్పెన్స్ అంతే."

"ఛీ..! ఈ నాన్న ఎప్పుడూ అంతే" బుంగమూతి పెట్టింది తరుణి.

"ఓకె మీ సర్ ప్రైజ్ మీ దగ్గరే పెట్టుకోండి. రేపు మటుకు మమ్మల్ని మై ఫెయిర్ లేడి సినిమాకు తీసుకెళ్ళుతామన్నారు నాన్న. గుర్తుందా?" పూర్ణిమ గారాలు పోయింది.

"వావ్, నేను ఎన్నాళ్ళ నుండో ఆ పిక్చర్ కోసం వెయిట్ చేస్తున్నాను. నేను కూడా మీతో వస్తాను." సునంద గెంతులు వేయటం ఒక్కటే తక్కువ.

రేణుకకు అర్థం కాలేదు. "ఏంటో ఆ సినిమాలో అంత స్పెషాలిటీ?"

"అది మన బోటి భాషా పిచ్చివాళ్ళకు చాల బాగుంటుంది. ఆ సినిమా చూసే ముందర నా దగ్గర ఆ సినిమాకు ఆధారమైన ఇంగ్లీషు డ్రామా వుంది అది చదవండి. లేకపోతే డైలాగులు అర్థం కావు." సునంద వివరించింది.

"అందులో అర్థం కాకపోవటానికేముంది? అన్ని ఇంగ్లీష్ సినిమాల లాగానే కదా!"

"మా తల్లే. అంత సులభం కానే కాదు. మన తెలుగులో చదువుకున్న పట్నం వాళ్ళ భాష, చదువుకోని పల్లెటూరు వాళ్ళ భాషలో తేడా ఏ విధంగా వుంటుందో అక్కడ కూడా అంతే.

ఒక ఇంగ్లీష్ ప్రొఫెసర్ ఫ్రెండ్ తో చాలెంజ్ చేసి ఒక పూలు అమ్ముకునే పల్లెపిల్లను తెచ్చి సొసైటీలో ఆమె చాల వున్నతమైన చదువుకున్న మనిషిగా చలామణీ చేయాలి. ఆ సందర్భంగా ఆ పూలపిల్ల మాట్లాడే భాష పూర్తిగా స్లాంగ్. మనం అట్లాగే డైలాగులు చదివినా విన్నా ఒక్క ముక్క కూడా అర్థం కాదు.

బెర్నార్డ్ షా రాసిన పిగ్మెలియాన్ అనే డ్రామా దీనికి ఆధారం. అయితే బుక్ లో ఆ అమ్మాయి అనే డైలాగ్లకు బ్రాకెట్లో మామూలు భాష అంటే వాడుక ఇంగ్లీష్ లో డైలాగులు వుంటాయి. అందుకే బుక్ చదివి సినిమా చూస్తే ఇంకా ఎంజాయ్ చేయవచ్చు."

"అమ్మాయి సునందా మంచి ఇన్ఫర్మేషన్ ఇచ్చావు. ఇదే పద్ధతి మన సంస్కృతం లో కూడా వుంటుంది."

"ప్రాచీన భారతంలో సంస్కృతానికి సంబంధించి కూడా కొంత వర్ణ లింగ వివక్ష వుండేది. దాని ప్రకారం బ్రాహ్మణులు క్షత్రియులు, అది కూడా పురుషులు మాత్రమే సంస్కృతంలో మాట్లాడే అర్హత కలిగి వుండేవారు. ఆడవారు, ఇతర జాతులలోని పురుషులు సంస్కృతం ఉచ్చరించరాదు."

"దానికి బదులుగా ప్రాకృత భాష అని వుండేది. మన గొప్పగొప్ప రచయితలందరు రాసిన నాటకాలలో సంభాషణలు ఆ విధంగానే

వుండేవి. ఇప్పుడు సునంద చెప్పినట్టు డైలాగు ప్రాకృతంలో వుండేవి. అది అందరికి అర్థం కాదని బ్రాకెట్ లో సంస్కృతంలో కూడా ఇచ్చేవారు."

అట్లా కొంత సేపు సరదా కబుర్లు చెప్పుకుంటూ తాంబూలాలు వేసుకొన్నారు.

"ఏమే, సుధా.. సీతా, ఆ ఆడపిల్లలను పిలిచి మొహాలు కడుక్కొని రమ్మను. అందరూ తలలు దువ్వుకొని వాకిట్లో దీపం పెట్టండి. సంజె వేళవబోతోంది."

"అమ్మాయి సునందా! ఏమిటే ఆ జుట్టు చిక్కు తీయటం? నిక్షేపమంటి జుట్టును ఆ విధంగా పీకి పీకి పెడుతున్నావు. ఇటురా, చిక్కు తీసి జడ అల్లుతా."

అత్తగారు ఎత్తుబల్ల మీద కూర్చుంటే సునంద చిన్న స్టూల్ వేసుకొని కూర్చున్నది. ఆమె బారెడు జడ స్టూల్ దాటి నేలకు తగులుతున్నది. అత్తగారు నెమ్మదిగా చిక్కు తీసి నూనె రాసి జడ అల్లి పూలు పెట్టి, "ముందుకు తిరుగు చెంపలు దువ్వుతాను," అంటూ ముందుకు తిరిగిన కోడలు చెంపలు దువ్వి వేళ్ళు మెటికలు విరుచుకుంది.

"అబ్బా పెళ్ళయిపోయిందిగా! ఇంకా చెంపలు దువ్వటం ఎందుకు అత్తయ్యా?" గారాలు పోయింది.

"ఎందుకా, మళ్ళీ జన్మలో కూడా మంచి మొగుడొస్తాడని." అంటూ బుగ్గలు తడిమి వేళ్ళు ముద్దుపెట్టుకుంది జానకమ్మ.

"మరి ఆ జన్మలోకూడా మీరే అత్తగారుగా రావాలి."

"పిచ్చిమొద్దా" అంటూ దగ్గరకు తీసుకోబోయిన అత్తగారి చేతులు తప్పించి గబుక్కున ఆవిడ వళ్ళో తల పెట్టుకొని నడుము చుట్టూ రెండు చేతులు చుట్టి వాటేసుకుంది.

ఇంట్లో కోడళ్ళకు అలవాటైన సీనే. "ఏమమ్మా తోటికోడలా, అట్లా అత్తయ్యగారి వళ్ళో గారాలు పోతూ ముద్దులు కులకటమేనా, తులసికోట దగ్గర దీపం పెట్టేదేమన్నా వున్నదా?" తోటికోడలు వాతావరణం తేలిగ్గా చేద్దామని తనకు కూడా కళ్ళనీళ్ళు వస్తున్నా ఆపుకొని అంది.

సునంద పడుకొన్నట్టే పడుకొని అక్కడే అత్తగారి వళ్ళోనే కళ్ళు శుభ్రంగా తుడుచుకొని తల పైకెత్తి, "నీకెందుకమ్మా అంత కుళ్ళు. కావాలంటే నువ్వు పడుకో పో. అత్తయ్యగారి వడి ఖాళీ అయింది. ఊఁ ఊఁ "అంటూ జడ వెనక్కి విసిరేసుకుంటూ తిప్పుకుంటూ లోపలికి దీపం పెట్టటానికి వెళ్ళింది.

కుసుమకు ఏమీ అర్థం కాలేదు.

తరువాత తరుణిని అడిగింది.

"సునందపిన్ని ఎందుకు అంత ఎమోషనల్ అయింది పూర్ణిమా?"

"తరువాత చెప్పుతాలే. పిన్ని మధ్యమధ్యలో ఎమోషనల్ అవుతుంది. అటువంటప్పుడు ఇట్లాగే అమ్మ వళ్ళోనో, పెద్దపిన్ని వళ్ళోనో నాయనమ్మ వళ్ళోనో కాస్సేపు పడుకొని ఎవరికి కనిపించకుండా కళ్ళనీళ్ళు పెట్టుకొని లేస్తుంది."

"నిజంగా సునంద పిన్ని ఎంత లైవ్లీగా వుంటుంది కదా! ఆమె కంపెనీలో వుంటే ప్రపంచంలో దిగుళ్ళూ దుఃఖాలనేవి వుంటాయని కూడా తెలియదు." తరుణి ఇంట్లో ఆ రాత్రి సంభాషణ మొదలయింది.

కుసుమ మాటలకు శ్రీహరి ఆయన భార్య మొహాలు చూసుకున్నారు.

"కుసుమా! లోకంలో అట్లాంటి వాళ్ళు వుండటానే ఈ మాత్రం సుఖ సంతోషాలు వెల్లి విరుస్తున్నాయి. నిజమే సునంద గురించి నువ్వు

అన్నమాట అక్షర సత్యం. కాని ఆ అమ్మాయి ఒక నివురు కప్పిన నిప్పు."

"అదేంటి అంకుల్, పిన్ని అంత ఆనందంగా నవ్వుతూ అందరిని నవ్విస్తూ వుంటుందికదా. మీరేమో నిప్పు అంటారేమిటీ?"

"పైకి కనిపించే విషయాల వెనక ఎంత విషాదముంటుందో కనిపించకుండా వుండటానికి ఎంత గుండె నిబ్బరం కావాలో మనం ఊహించను కూడా లేము."

------

భూమి మీద పడ్డ మరుక్షణం నుండే సునంద జీవితంలో విషాదం మొదలయింది.

తల్లి పురిట్లోనే మరణించింది. భార్య అంటే అమితమైన ప్రేమ వున్న తండ్రి అ వార్త వినగానే పట్టరాని దుఃఖంతో ఎవరికి చెప్పా పెట్టకుండా ఇల్లు విడిచి వెళ్ళిపోయినాడు. వూళ్ళోనే కొంతకాలం పిచ్చివాడిలాగా తిరిగాడు. తల్లితండ్రిని కూడా గుర్తుపట్టకుండా అయిపోయినాడు. ఆ పిచ్చి లోనే తిరిగి తిరిగి ఒక సారి చెరువులో శవమై తేలాడు.

పురిటి కందును చూసుకొనేవారే లేకపోయినారు. బిడ్డ చచ్చినా పురిటికంపు వదలలేదు అన్న సామెత చెప్పినట్టు తల్లి మరణించినా కొన్ని కొన్ని ఫార్మాలిటీస్ తప్పవుగా! సునంద అమ్మమ్మగారి ఇంట్లో కూతురు మరణించిన బాధలో వున్నారు. కాని ఆమె వదిలిపోయిన ఈ పిల్ల వుంది.

అటు అత్తింట పుట్టింట ఆస్తిపాస్తులకు లోటు లేదు. బలగానికి లోటులేదు. ఇంతవుండి కూడా ఆ పసిదాని ఆలనాపాలనా చూసేవారే లేకపోయినారు.

తల్లిని మింగి పుట్టిన నష్ట జాతకురాలని గుక్కలు పట్టి ఏడుస్తున్న ఆ చంటిదాని వైపు చూసిన వారు కూడా లేరు. ఏడ్చి ఏడ్చి అదే చస్తుందిలే ఈ పీడా వదుల్తుంది అని ఇంట్లో అందరూ వదిలేసినా ఆ పురుడు పోసిన మంత్రసాని మటుకు అట్లా వదలలేకపోయింది. అక్కడ ఇక్కడ ఎవరో బాలింతలను పట్టుకొని పసి బిడ్డకు పాలు ఇప్పించేది.

ఆ రోజులలో పురుళ్ళన్ని ఇళ్ళల్లోనే జరగటాన పదకొండు రోజులు పురుటి మంచం తప్పదు. కాని బాలింత లేని పురిటి గది. పత్యాలు భోజనాలు పెట్టటానికి గదిలోకి వెళ్ళ వలసిన అవసరం లేదు. అంచేత ఎవరు కూడా ఇంటికి ఒక పెడగా వున్న ఆ గది ఛాయలకు కూడా వెళ్ళలేదు.

ఆ ఇంటినే నమ్మకంగా పట్టుకొని ఉన్న పనివాళ్ళూ పాలేరుల భార్యలు మటుకు ఆ పసిదాన్ని అట్లా వదలలేక పోయినారు. మంత్రసాని సహాయంతో వాళ్ళే ఆ పాప పోషణ భారం వహించారు.

ఎప్పుడైనా చంటిబిడ్డ ఏడుపు ఆ గది నాలుగు గోడలు దాటి బయటికి వచ్చినప్పుడు ఆ ఇంటి కోడలు మనసులోని మాతృత్వం మేల్కొనేది.

అట్లాంటి వాతావరణంలో మూడు నెలలు గడిచిన ఆ పాపను, ఒక మంచి రోజు చూసి ఆవిడ ఎత్తుకొని నాయనమ్మ గారి ఇల్లు చేరింది.

వారి ఇంట కూడా విషాదం అలుముకొని వున్నది. కోడలి మరణం కొడుకు పిచ్చివాడై చెరువులో చావటం వాళ్ళను మానసికంగా కృంగదీసింది. ఆ సమయంలో పసిబిడ్డ ఇంటికి రావటం వాళ్ళు అసలు వూహించని సంఘటన. అక్కడ కొంత వాదోపవాదాలు నడిచాయి.

"మా కొడుకే పోయిన తరువాత ఇంక ఈ పిల్లతో మాకేం పని? అదే ఏ మగ పిల్లవాడో అయితే ఇంటి వారసుడని తెచ్చుకొనే వారం. ఈ ఆడపిల్ల మాకెందుకు? మీరే పెంచుకోండి."

"అయ్యో అదేంటి పిన్నిగారూ? అన్ని తెలిసిన మీరే అట్లా అంటే ఎట్లా? కష్టమో నిష్టూరమో మాది మేనమామల ఇల్లే. ఎప్పుడైనా

చుట్టపు చూపుగా వస్తూ పోతూ వుండవలసినదే కాని మాఇంట్లో ఏట్లా వుంచుకుంటాము? అయినా మేము పెంచుకున్నా కూడా మీకే అప్రదిష్ట. మనుమరాలిని ఆ విధంగా గాలికి వదిలేసారని అందరూ మిమ్మల్నే ఆడిపోసుకుంటారు.

ఈ మూడు నెలలు కూడా మా ఇంటి ఆడపడుచు పోయిన దుఃఖంలో వుండి ఈ పిల్ల ఆలనా పాలనా కూడా లేదు. ఏది ఏమైనా ఎక్కడుండవలసిన వారు అక్కడే వుండటం క్షేమదాయకం." ఎంతో లౌక్యంగా ఆమె పాపను ఆ ఇంట వదిలి వచ్చింది.

కాని అక్కడ కూడా ఇక్కడి పరిస్థితే.

మళ్ళీ పనివాళ్ళు పాలేర్ల చేతిలోనే ఆ పాప పెంపకం. డబ్బుకు ధనానికి కొరత లేదు.

"అమ్మగారు పాపాయికి పాలడబ్బా అయిపోయింది. పాపాయికి గౌన్లు చినిగి పోయాయి."అని ఎవరైనా పనివారు వచ్చి అడగటమే తరువాయి అన్ని అమరేవి.

ఆ పాప తాతగారి తల్లి పేరు సునంద. పనివారందరూ బుల్లి సునందమ్మ అనటం మొదలెట్టారు. ఎవరూ పెట్టకుండానే ఆ పాపకు సునంద అని నామకరణం జరిగి పోయింది. ఇంటి పని మనుషులలో వయసులో పెద్ద, చాల సంవత్సరాలగా ఆ ఇంటినే కనిపెట్టుకొని ఇంటి మనిషిలా మసిలే శివమ్మ ఆధ్వర్యంలో సునంద పోషణ జరుగుతున్నది.

పెద్ద ఇళ్ళల్లో జరిగే నాజూకు పోషణ కన్నా పేదవారింట పెంపకం, అంటే వాళ్ళు తినే జొన్న అన్నం రాగి సంకటి వంటి బలవర్ధకమైన ఆహారం సునందకు కూడా పెట్టేవారు. దాంతో ఆ పాప బలంగా పెరగసాగింది.

మంచి తెలివైన పిల్ల. పచ్చటి పసిమి చాయ, చెంపకు చారడేసి కళ్ళు అందమైన రూపం. చూసే వాళ్ళను ఇట్టే ఆకట్టుకుంటుంది. గలగలమంటూ అందరి మధ్య కబుర్లు చెప్పుతూ చలాకీగా తిరిగే ఆ మూడేళ్ళ పాపకు అన్ని వున్నాయి కాని అంగట్లో శని అన్నట్టు ఇంటి వారి ఆప్యాయానురాగాలు మాత్రం లభించలేదు.

ఈ ప్రాపంచిక విషయాలేవీ తెలియని అమాయక పాప అంతా తనవారే అనుకుంటూ ఇంటా బయటా తిరుగుతూ వుండేది.

కాలం అలలు ఎవరికోసం ఆగవు అన్న సామెతను నిజం చేస్తూ అట్లా పెరిగిన సునంద బడికి వెళ్ళటం, ఆ తరువాత కాలేజీకి వెళ్ళటం యధావిధిగా జరిగి పోయాయి.

అందరి ఇళ్ళకు తిరిగేది. తన ఈడు పిల్లలతో ఆడుకునేది. వరసలు పెట్టి అందరిని పిలిచేది. ఇరుగు పొరుగు వారందరూ కూడా సానుభూతితో ఆమెను ఆదరించేవారు.

ఒకసారి వారి ఇంటి పక్కనే వున్న బంధువుల ఇంటికి పెళ్ళికి వచ్చిన జానకమ్మ సునందను చూసింది. బంధువుల నుండి విషయాలన్ని తెలుసుకున్నది. చకచక బొంగరంలాగా తిరుగుతూ కబుర్లు చెప్పుతూ అంతటా తానే అయి తిరుగుతున్న ఆ అమ్మాయిని చూసి వివరాలు తెలుసుకొని ఇంటికెళ్ళిం తర్వాత కొడుకులతో సంప్రదించి సునందను చిన్న కోడలుగా తెచ్చుకుంది.

ఎదురుగా వున్నప్పుడు పట్టించుకోకపోయినా, ఒంటరిగా వున్నప్పుడు తాత నాయనమ్మ లోలోపల దిగులు పడుతూ వుండేవారు.

ఎవరికి పట్టని ఈ గుండెలమీద కుంపటిని దింపేదెట్లా అని అడపాతడపా బాధ పడే సునంద నాయనమ్మ ఎంతో ఆనందించింది. ఎంత చెడ్డా తమ రక్తం. అది సుఖంగా వుంటే సంతోషమేగా!

సునందకు లోలోపల ఏదో బాధ. ఏంటో తెలియదు. కాని అందరి పిల్లలలాగా తన బతుకు లేదు అని తెలుసు. ఆ బాధ నుండి దూరం అవటానికి వూళ్ళో వున్న లైబ్రరీలో పుస్తకాలు చదవటం అలవాటయింది. ఇంగ్లీషు తెలుగు భాషలలో అనేక పుస్తకాలు చదివిన సునంద లోకాన్ని బాగ ఆకళింపు చేసుకుంది.

పుట్టినప్పటి నుండి ఎరుగని తమ వాళ్ళు అన్న భావన ఇన్నాళ్ళకు అత్తగారింట దొరికింది సునందకు. ఆ ఇంట్లో ఆమెను కోడలిగా

కన్నా ఇంటి ఆడబడుచుగా ఆదరించారు తోడికోడళ్ళు. అందుకనే చలాకీగా పిల్లలలో పిల్లగా అయి ఆడుకొనే అవకాశం దొరికింది.

దానికి తగ్గట్టే బావగార్ల వద్ద కూడా తలుపు చాటున నిలబడి మాట్లాడే సాంప్రదాయానికి కూడా స్వస్తి పలికింది. ఆ కారణం చేతనే పూర్ణిమతో సమానంగా బావగార్ల వద్ద కూర్చొని ప్రపంచంలోని అన్ని విషయాల గురించి చర్చించేది. బావగార్లు భర్త కాక శ్రీహరి కూడా ఆమె అభిరుచి గుర్తించి రకరకాల సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు తెచ్చి ఇచ్చి ఇంకా ఇంకా ప్రోత్సాహం ఇచ్చేవారు.

శ్రీహరిగారి ఇంట్లో కూడా అంతే చనువుగా తిరిగేది. ఆయన వద్ద మంచి హోం లైబ్రరీ వుంది. ఆ పుస్తకాలు కూడా పట్టుకెళ్ళి చదివి తిరిగి పెట్టి మళ్ళీ మళ్ళీ తీసుకెళ్ళటం కూడా చేస్తుంది. ఒకరి అనుమతి కూడా అవసరం లేదు.

శ్రీహరి సునందను తరుణితో సమానంగా చూసుకుంటూ ఎడ్యుకేట్ చేయటానికి ఇంకా తోడ్పడుతున్నాడు. అప్పటికే డిగ్రీ పూర్తి చేసిన ఆమెకు పై చదువులు చదివేటందుకు తన చేతనైన సహాయ సహకారాలు అందిస్తున్నాడు. ఆ విధంగా సునంద ప్రైవేట్‌గా ఎం.ఎ. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నది.

ఈ విషయాలను విన్న కుసుమకు మరొక షాక్.

అన్ని బాధలలో పెరిగిన సునంద పిన్ని ఇంత ఆనందంగా ఎట్లా వుండగలుగుతోంది? ఇంకో ప్రశ్న. అదే మాట శ్రీహరితో అన్నది.

"అంకుల్ మరి నాకేమో ఎప్పుడూ అమ్మ నాన్న లేరన్న దిగులు బాధిస్తూ వుంటుంది. మరి సునంద పిన్ని అంత ఆనందంగా ఎట్లా కనిపించగలుగుతున్నది?"

"అదేనమ్మా మనిషిలో వున్న గొప్పతనం. ఒకే సిట్యువేషన్‌కు ఒక్కొక్కరు ఒక్కొక్కరకంగా రెస్పాండ్ అవుతుంటారు. ఒకరు డీప్ డిప్రెషన్‌లోకి వెళ్ళితే, మరొకరు హైపర్ ఏక్టివ్ గా వుంటారు. నీ కేస్ మొదటిది. సునందది రెండవది. నేను ఇట్లా పదేపదే చెప్పుతున్నానని అనుకోవద్దు. మనకు ఎన్నెన్నో పరిస్థితులు ఎదురవుతూంటాయి. వాటిని ఎదుర్కుంటూ పోతుంటేనే అభివృద్ధి దిశగా ప్రయాణించ గలుగుతాము. అంతే కాని నాకు దేవుడు అన్యాయం చేసాడే అని కుమిలి పోతూ వుంటే అదే మూడ్‌లో వుండి పోయి ఒక్కడుగు కూడా ముందుకు పోలేవు. అమ్మ నాన్న లేని లోటు మర్చిపోలేము. నిన్ను ప్రేమిస్తున్న ప్రతి వ్యక్తిలోనూ అమ్మను నాన్నను చూసుకోటమే దానికి మందు. అంతే కాని నేను అనాధను అన్న ఆలోచనే నీ ప్రగతికి ప్రతిబంధకంగా మారకూడదు.

చూసావుగా సునందను. మేము చెప్పేదాకా నీకు ఆమె బాక్ గ్రౌండ్ తెలియలేదు. ఆ అమ్మాయి పైకి అంత ఆనందంగా కనిపిస్తున్నది కదా! లోపల ఎంత బాధ వుందో ఎవరికి తెలుసు? ఈ రోజు నీ కళ్ళ ముందరే ఆమె బాధపడటం చూసావుగా! అంటే ఆనందం దుఃఖం కూడా తాత్కాలికమే. పరిస్థితులకు అనుగుణంగా మారటమే మనిషిలోని ప్రత్యేకత. అప్పుడే మనశ్శాంతిగా వుండవచ్చు."

కుసుమ ప్రశ్నల పరంపర పెరిగిపోతోంది.

ఆత్మ విమర్శ కూడా పెరుగుతోంది.

మొదట యాది, తరువాత నరసి. ఇప్పుడు సునంద పిన్ని.

వీళ్ళందరి ముందు తనకొచ్చిన కష్టం అన్ని పెద్ద గీతల మధ్య చాలా చాలా చిన్న గీత. అహఁ కాదు గీత కూడాకాదు ఒక చిన్న చుక్క.

ఈ పది రోజులు ఇంటి నుండి బయటికి వస్తేనే యిన్నిన్ని అనుభవాలు. అంటే తను చూసిన చూస్తున్న ప్రపంచం ఎంత చిన్నదో! ఇంకా ముందు ముందు ఎంత చూడాలో?

తను ఇన్నాళ్ళూ కట్టుకున్న మానసిక బంధంలోంచి మెల్లిమెల్లిగ బయటకు రావటం ఆమెకే కాదు చూసే వారికి కూడా అర్థమౌతోంది.

తన మీద తను పెంచుకున్న సెల్ఫ్ పిటీ నెమ్మదిగా తగ్గి చుట్టూ వున్న కష్టాలు కనిపిస్తున్నాయి. ఇంతకు ముందు ప్రతి మాట కసితో కచ్చగా వుండేది. ఎవరి మీదనో తన కోపం తెలిసేది కాదు. అటువంటిది ఇప్పుడు మాటలో కరుకు తనం పోయి సౌమ్యత వస్తోంది. కాని ఇంకా పూర్తిగా మారాలి అంటే సమయం పడుతుంది.

శ్రీహరిగారు చెప్పిన విషయం గురించి అందరూ మర్చి పోయినారు. ఎవరి ఇళ్ళల్లో వాళ్ళు విశ్రాంతి తిసుకుంటున్నారు.

తరుణి, కుసుమ, పూర్ణిమ శ్రీహరిగారు కూర్చొని కేరం బోర్డ్ ఆడుతున్నారు.

గేటు చప్పుడయింది. తరుణి లేచింది, "ఎవరో వచ్చారు చూసొస్తాను."

"అమ్మడూ నువ్వు కూర్చో. అమ్మాయి కుసుమా ఎవరొచ్చారో చూసి రా."

పూర్ణిమ తండ్రి వంక చూసింది, అదేంటి, అన్నట్టు. ఆయన కళ్ళు నవ్వుతున్నాయి. కూతురికి సైగ చేసాడు.

తలుపు తెరిచిన కుసుమ అక్కడే ఆగిపోయింది. "తాతయ్యా.. బామ్మా!" అంటూ వచ్చిన వాళ్ళను అమాంతం వాటేసుకుంది. "మీరేంటి చెప్పాపెట్టకుండా ఇట్లా వచ్చారు?"

వెనకనే పిన్ని బాబాయి తమ్ముళ్ళు చెల్లెలు కూడా నవ్వుతూ నిలబడ్డారు. తాత బామ్మను వదిలి వాళ్ళ దగ్గరకు వెళ్ళి వాళ్ళను వాటేసుకుంది. పిన్ని ఆమె నుదిటి మీద ముద్దు పెట్టి "ఎట్లా వున్నావురా అమ్మలూ?" అని అడగంగానే, కుసుమకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "పిన్నీ ఐ మిస్ యూ ఆల్." అంది.

కుసుమ లో వచ్చిన ఈ అనూహ్యమైన మార్పు వాళ్ళు ఎదురు చూడనిది.

"ఏమ్మా కుసుమా! వచ్చిన వాళ్ళను లోపలికి రానిస్తావా? అటు నుండి అటే మాట్లాడి పంపిస్తావా?" అని నవ్వుతూ "రండి బాబాయిగారూ. ఇల్లు కనుక్కోవటం కష్టమేం కాలేదుగా." అంటూ వాళ్ళను సాదరంగా ఆహ్వానించేటప్పటికి ఇదన్న మాట ఈయన మధ్యాహ్నం వూరించిన సర్ప్రైజ్ అని అందరికి అర్థమయింది.

"లేదు శ్రీహరీ... ఇంతకు ముందర ఒకసారి వచ్చి వెళ్ళాముగా. సులభంగానే కనుక్కోగలిగాము."

రెండు రోజుల ముందర ఇంటికి వచ్చిన శ్రీహరిని చూసి వాళ్ళకు ఆశ్చర్యం అనిపించింది. వెంటనే కంగారు కూడా. "మా కుసుమ ఎట్లా వుంది బాబూ?" ఆరాటం పట్టలేని బామ్మగారు అడిగేశారు.

"కుసుమ చాలా హాపీగా వుంది. మా ఇంటికి వచ్చినప్పటికి ఇప్పటికి ఆమెలో చాల మార్పు వచ్చింది. ఇంతకు ముందరలా ముడుచుకు పోవటం లేదు. ఎంతో ఓపెన్ గా మాట్లాడుతోంది. మనుష్యులలో పడింది. ఇప్పుడు నేను ఇక్కడికి వచ్చింది మిమ్మల్ని పండగ నాడు మాఇంటికి ఆహ్వానించటానికి."

అంతకు ముందర ఆయన కుసుమను తమ ఇంటికి తీసుకెళ్ళుతానన్నప్పుడు మాధవ్ ఆయన ఆఫీసుకు వెళ్ళి కుసుమ ప్రవర్తన గురించి, ఆమె ఎప్పుడూ దిగులుగా వుండటం గురించి వివరించాడు. "శ్రీహరి గారూ మాకందరికి కుసుమ గురించే బెంగ. మా అన్నయ్య వదిన బాబూ ఆ ప్రమాదంలో మరణించిన తరువాత ఎందుకో తెలియదు, మమ్మల్నందరిని శత్రువులుగా చూస్తోంది. ఏం చేస్తే తను మామూలు మనిషవుతుందో అర్థం కావటం లేదు. అమ్మనాన్న పెద్ద వాళ్ళయిపోయినారు. కొడుకు మరణం ఒక పక్క వేధిస్తూంటె కుసుమ గురించిన బాధ ఇంకో పక్క." అంటూ వాపోయినాడు.

ఆ కారణం వల్ల కూడా శ్రీహరి కుసుమ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు.

"మిమ్మల్ని చూడంగానే కుసుమ రియాక్షన్ ఎట్లా వుంటుందో మీరే చూడండి. ఆమె మిమ్మల్ని బాగ మిస్ అవుతున్నట్టు

కనిపిస్తున్నది."

ఆయన అందరిని భోజనానికే పిలిచాడు. కాని వారు సున్నితంగా తిరస్కరించారు. "వద్దు శ్రీహరి. మా పెద్ద కొడుకు మరణించి ఏడాది కూడా కాలేదు. మాకు పండగలు సెలిబ్రేట్ చేసుకోవటానికి మనస్కరించటం లేదు." వారి కళ్ళల్లో నీళ్ళు తిరగటం స్పష్టంగా కనిపించింది. వాళ్ళ సెంటిమెంట్‌ను ఎందుకు హర్ట్ చేయాలి అని బలవంతం చేయలేదు.

"సరే అయితే. పండుగ అని కాదు కాని నవమి నాడు సాయంత్రం వూరికే వచ్చిపోండి." అని ఆహ్వానించాడు.

వారు కూడా కుసుమను చూసి పది రోజులు అయింది. ఒక్కసారి చూసి వద్దామని అనిపించి సరే అన్నారు.

అక్కడి నుండి ఆయన రేణుక ఇంటికి కూడా వెళ్ళి వారిని కూడా ఆహ్వానించి వచ్చాడు.

దాని ఫలితమే వారి ఆగమనం. వారు కూర్చున్న కాస్సేపటికి రేణుక పేరెంట్స్ కూడా వచ్చారు.

కుసుమ అయితే కొద్ది సేపు తాత బామ్మ మధ్యలో కొద్దిసేపు పిన్ని బాబాయి మధ్యలో కూర్చొని వాళ్ళ చేతులు పట్టుకొని వదలక పోవటం చూసిన అందరికి శ్రీహరి చెప్పిన విషయాలు నూటికి నూరుపాళ్ళు నిజమే అని అర్ధమయింది.

అందరూ ఆరుబయట కుర్చీలు నులక మంచాలు వేసుకొని కూర్చున్నారు. పూర్ణిమ కుటుంబ సభ్యులు కూడా వచ్చి చేరారు నాలుగు కుటుంబాల సభ్యులు బాగ సన్నిహితులయినారు.

సునంద ఆ స్నేహితురాళ్ళకు పెట్టిన పూతరేకు అన్న పేరు విని అందరూ నవ్వుకున్నారు.

"శ్రీహరి, మేము బయలుదేరుతాము. ఇంక కుసుమను మాతో తీసుకెళ్ళుతాం. ఏమ్మా కుసుమా వస్తావా?" అనగానే కుసుమ వెంటనే, "ఆ వచ్చేస్తాను." అంటూ లేచింది.

"బాబాయిగారూ, మీకభ్యంతరం లేకపోతే రేపు విజయదశమి పండుగ కూడా చేసుకొని నేనే వచ్చి కుసుమను మీ ఇంట్లో దిగబెడతాను. ఏమ్మా కుసుమా, ఇంకొక్క రోజు మీ తాత బామ్మను వదిలి వుండకలుగుతావా?" అంటూ నవ్వుతూ అడిగాడు.

తన జీవితంలో మొదటిసారి పండగ అంటే ఎట్లా వుంటుందో పూర్తిగా అనుభవించింది కుసుమ. బంధుత్వాలు అంటే ఏమిటో తెలుసుకున్నది. బొంబాయిలో పుట్టి మన సంస్కృతి సాంప్రదాయాలకు దూరంగా పెరిగి ఒక్కసారి ఇంత అందమైన అనుభూతి మిగిల్చిన దసరా పండగ ఆమె జీవితానికి ఒక పెద్ద మలుపు.

తల్లితండ్రుల మరణానంతరం మౌనంగా మారిపోయిన కుసుమ తాత, బామ్మ, పిన్ని, బాబాయి దగ్గర తరుణి పూర్ణిమతో గడిపిన రోజుల గురించి కథలుకథలుగా చెప్పసాగింది. వారితో గడిపింది పదిహేనురోజులు. కాని జన్మకు సరిపడా అనుభవం మిగిల్చింది. ఎన్ని రోజులు చెప్పినా తరగకుండా వచ్చేవూబిలాగా కబుర్లు వస్తూనే వున్నాయి.

ఆ రెండు కుటుంబాలలోని వ్యక్తులు కూడా ఒకరిని మించిన వ్యక్తిత్వం ఒకరిది.

ఆప్యాయతానురాగాలు చూడాలంటే ఆ రెండిళ్ళ మధ్యనే చూడాలి.

తల్లి ప్రేమ కావాలంటే అక్కడేచూడాలి.

స్వతహాగా అందరూ మంచివారేనా? ఒకరి నుండి మరొకరికి ఈ మంచితనం అన్న జబ్బు అంటుకున్నదా?

ఏ బంధంతో యాదికి అండగా నిలవటమే కాక ప్రేమాలయంలో అమ్మాయిలకు చేయూతనందిస్తున్నాడు శ్రీహరి?

ఏ సంబంధం వున్నదని జానకమ్మ నరసికి తగిలిన గాయాలు తనకో తన బిడ్డలు మనుమలకో తగిలినట్టు తల్లడిల్లిపోయింది?

పక్కింటి యజమానికి వళ్ళు నలతగా వుంటే తట్టుకోలేక దిష్టి తీయటం,

మనుమరాలి స్నేహితులకు కూడా కలిపి ఆప్యాయత రంగరించి అన్నం కలిపి పెట్టటం,

సునందను కోడలులాగా కాకుండా కూతురో మనుమరాలో అన్నట్టు గారాబం చేయటం.

ఇవన్నీ మరువదగిన విషయాలా?

వారేమైనా మరువదగిన మనుష్యులా?

ఆయన ఔన్నత్యం హిమాలయాలంత ఎత్తు. అంత చేస్తున్నా సింప్లిసిటీకి మారుపేరు ఆయన వ్యక్తిత్వం.

ఆదర్శ స్త్రీకి మారుపేరు జానకమ్మ. అత్తగారిని అమ్మలా భావించే ముగ్గురు కోడళ్ళు.

వాళ్ళు తోడికోడళ్ళా? స్వంత అక్కచెల్లెళ్ళకన్నా ఆప్యాయంగా మసులుకుంటున్నారు. ఏ ఒక్కరోజు కూడా వాళ్ళ మధ్య ఎటువంటి బేధాభిప్రాయాలూ వచ్చినట్టు కనిపించలేదు.

తండ్రి బొంబాయిలో ఎంతో సంపన్నుడి కిందే జమా. విలాసవంతమైన జీవితం కోసం విచ్చలవిడిగా ఖర్చుపెట్టటమే కాని ఎటువంటి సత్కార్యానికి కూడా ధనం వెచ్చించినట్టు కనిపించలేదు. ఇవన్నీ ఆలోచించిన కుసుమ మనసులో దృఢంగా నిర్ణయించుకుంది. జీవితంలో ఎట్లాగైనా మానవ సేవ చేయాలి. ఒకరికి ఉపయోగపడేలాగా వుండాలి.

తాతగారు బాబాయితో మాట్లాడింది. "తాతయ్యా, నాన్న నుంచి నాకు సంక్రమించిన ఆస్తి వుంది కదా! కొంత బాంకులో డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో పేద అమ్మాయిల చదువుకు ఉపయోగిస్తే ఎట్లా వుంటుంది?"

"అమ్మా కుసుమా, నువ్వింకా మైనరువే. మేము ఆ ఆస్తికి గార్డియన్లము మాత్రమే. కనుక ఇప్పుడు దాని మీద నీకు కాని మాకు కాని ఎటువంటి అధికారమూ లేదు. నీకు మైనారిటీ తీరిన తర్వాత అట్లాగే నీ ఇష్టానుసారం వినియోగించుదాము. అంతదాకా ఓపిక పట్టు," అంటూ చెప్పారు తాతగారు

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments